ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 5

శ్రీ సత్యసాయి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

భవిష్యత్తుకు గుర్తుండిపోయేలా

దిష్టిబొమ్మల్లా టెక్స్‌టైల్ పార్కులు.!

ఒక జిల్లా... ఒక ఉత్పత్తి కింద ఉన్నా ప్రోత్సాహకం కరువు

విజన్ 2047లోనైనా దృష్టి సారించేరా.?

రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కు ముఖద్వారం

అనంతపురం జిల్లాలో టెక్స్‌టైల్ పరిశ్రమలు వేలాది మందికి ఉపాధిని చూపుతున్నాయి. ఈరంగం ప్రధానంగా పామిడి, రాయదుర్గంలో విస్తరించి ఉంది. రాయదుర్గంలో జీన్స్ వస్త్ర పరిశ్రమ వ్యాప్తి చెంది ఉండగా, పామిడిలో నైట్ వేర్స్ వస్త్ర వ్యాపారం విస్తరించి ఉంది. ఈ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ రంగాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటనలు చేస్తున్నాయి. అయితే ఆశించినంతగా ప్రోత్సహకం లభించడంలేదు. కనీసం వీటి కోసం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులు కూడా అభివృద్ధికి నోచుకునే పరిస్థితుల్లేవు. ఈ రెండు చోట్ల కూడా వస్త్ర వ్యాపారం మందగమనంలో సాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయదుర్గంలో జీన్స్ వస్త్ర వ్యాపారం పెద్దఎత్తున ఉంది. సుమారు 600 యూనట్ల వరకు ఉన్నాయి. ఈ రంగంపై ఆధారపడి ఇక్కడ 50 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. కోవిడ్ నుంచి ఈ రంగం కోలుకోలేని పరిస్థితుల్లో ఉంది. సుమారు చిన్న, చితక యూనిట్లు 300 వరకు మూతపడ్డాయి. 74 ఉడేగోళం వద్ద 50కిపైగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశమున్నా ప్రస్తుతం రెండు మాత్రమే నడుస్తున్నాయి. అవి కూడా మందగమనంలోనే సాగుతున్నాయి. వీటికి ప్రోత్సహకం అందివ్వాల్సి ఉంది. ప్రభుత్వాలు అటువైపు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈ పరిశ్రమకు అవసరమైన చేయూతను అందివ్వాలని అక్కడి వ్యాపారులు కోరుతున్నారు.

రెండు దశాబ్ధాలైనా పూర్తవని టెక్స్‌టైల్ పార్కు

జిల్లాలో రాయదుర్గం తరువాత పామిడి ప్రసిద్ధి. నైట్‌వేర్ దుస్తుల్లో దీన్ని రెండవ ముంబయిగా పిలుస్తారు. సుమారు పది వేల కుటుంబాల వరకు ఈ రంగంపై ఆధారపడి ఉన్నాయి. దీనికి ప్రోత్సాహకం అందిస్తామన్న పేరుతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 2004లో శంకుస్థాపన చేశారు. ఇప్పటికి సరిగ్గా రెండు దశాబ్ధలు పూర్తయినా నిర్మాణం పూర్తవలేదు. రూ.1.76 కోట్లు ఖర్చు వృథాగానే ఉండిపోయింది. ఇప్పుడు చేనేత జౌళి శాఖ మంత్రిగానూ సవితమ్మ ఉన్నారు. ఈ రంగంపై ఆమె దృష్టి సారించి తగిన విధంగా చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

ప్రభుత్వం ఈ రంగాన్ని ఆదుకోవాలి

కరువు ప్రాంతమైన ఈ జిల్లాలో ఉపాధి చూపించే పెద్ద రంగంగా వస్త్ర రంగం ఉంది. రాయదుర్గం, పామిడిల్లో వేలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఆన్‌లైన్ వ్యాపారం ఊపందుకున్న తరువాత ఇక్కడి వ్యాపారులపై ప్రభావం పడుతోంది. వేలాది మంది ఉపాధిని కోల్పోయే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం ఆ రంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలి.

బి.శ్రీనివాసులు, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు.

రాయదుర్గంలో జీన్స్ ప్యాంట్లకు స్టిచ్చింగ్ చేస్తున్న కార్మికులు

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

భవిష్యత్తులో గుర్తుండిపోయేలా శ్రీసత్యసాయి జయంతి ఉత్సవాలను నిర్వహించేలా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలిపారు. ఈ ఏడాది నవంబర్ 23న జరిగే 100వ జయంతి ఉత్సవాలపై ప్రజా ప్రతినిధులు, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, ట్రస్టు ప్రతినిధులు రోమల్, చలం, షష్టి, ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జయంతి ఉత్సవాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా వారికి కేటాయించిన విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విమానాశ్రయం, ఆర్టీసీ బస్టాండ్, చిత్రావతి నది సుందరీకరణ పనులు, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, రవాణా సేవలు, మెడికల్ క్యాంపు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు ఆయా శాఖలు నివేదికలు ఇవ్వాలన్నారు. ధర్మవరం, పుట్టపర్తి రైల్వే స్టేషన్లలో తగిన వసతులు పర్యాటకులకు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ తాత్కాలిక ఆశ్రయ వసతులు వివిధ ప్రాంతాల్లో హెలీప్యాడ్లు నిర్మించాలన్నారు. వివిఐపిలు, వీఐపీలకు ప్రత్యేక రహదారి మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. బస్సుల సంఖ్య పెంచాలని, ప్రధాన పట్టణాల నుంచి భక్తులకు పర్యాటకులకు సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి పలువురు రాయబారులు ముఖ్యమైన ప్రతినిధులు మొత్తం 10 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణం అంతా అందంగా తీర్చిదిద్దాలని, చిత్రావతి నది సుందరీకరణ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ సారథి, ఆర్డీవో సువర్ణ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ సంజీవయ్య, డిపిఒ సమత సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట ప్రగతే లక్ష్యంగా పి-4 పాలసీ అమలు

దారిద్ర రేఖకు దిగువనున్న వారి ఇంట ప్రగతి లక్ష్యంగా ప్రభుత్వం పి-4 పాలసీ అమలు చేయనుందని, దాని అమలకు అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. రానున్న ఉగాది నాడు పి-4 పాలసీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎన్జీవోలు, ఎన్ఆర్ఐలు వ్యాపారస్తులు, స్థానిక నాయకులు వివిధ రంగాల నిపుణులను ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో నెల 7 నుంచి 22వ తేదీ వరకు సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లా అధికారులందరూ సమిష్టిగా పనిచేసే 5 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు.

'హంద్రీనీవా' మరమ్మతులు చేపట్టాలని వైసిపి ధర్నా

ప్రజాశక్తి-అగళి

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై గురువారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ మరమ్మతులు చేయకుండా లోతు పెంచాలనుకోవడం తగదన్నారు. ఈ ప్రాంతం లో కాలువ లోతు పెంచితే నీళ్ల రాకుండా అక్కడే స్తంభించిపోతాయన్నారు. తద్వారా మడకశిర నియోజకవర్గంలో ఉండే అమరాపురం, గుడిబండ, మడకశిర, రొళ్ల, అగళి మండలాలకు హంద్రీనీవా నీళ్ల రావన్నారు. ఇకనైనా కాలువలో పెరిగిన ముళ్ల పొదలు, పేరుకుపోయిన మట్టిని తక్షణమే తొలగించి, కాలువను వెడల్పు చేసి రెండు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తే ఈ ఐదు మండలాలకు సజావుగా నీళ్ల వస్తాయన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మీ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, మహేంద్ర, రొళ్ల, మడకశిర, గుడిబండ, అమరాపురం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయండి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణం దినదినాభివృద్ధి చెందడంతో పాటు ట్రాఫిక్ కూడా పెరిగిపోయింది. అంతేకాకుండా కొత్తగా కొడికొండ చెక్‌పోస్ట్ శిర, మడకశిర మీదుగా హైవే వేయడంతో పట్టణం గుండా భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. వాహన చోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతో పట్టణంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రమాదంలో మృతిచెందిన సంఘటనలు చాలా ఉన్నాయి. వాహన చోదకులు బాటసారులను ప్రమాదాలకు గురిచేసి ఆపకుండా తప్పించుకుపోయిన దాఖలాలు చాలా ఉన్నాయి. పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున ట్రాఫిక్ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసి భారీ వాహనాలను నిర్దిష్ట సమయంలో మాత్రమే నిర్దిష్ట వేగంతో పట్టణంలో తిరిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గురువారం రాజీవ్ గాంధీ సర్కిల్‌లో వాహన చోదకుడిపై వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

మడకశిరలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

బోరు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని తురకవాండ్లపల్లి గ్రామంలో సర్పంచి మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారని గ్రామస్తులు తెలిపారు. జమ్మానిపల్లి గ్రామంలోని వెంకటాపురం రోడ్డులో ఉన్న తాగునీటి బోరు పైపులైన్ లీకేజీ అవుతుండడంతో నీరు వృథా అయ్యేది. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచి ఆదేశాల మేరకు ఆమె భర్త హనుమంత రాయప్ప దగ్గర ఉండి గ్రామంలో నూతనంగా పైపులైన్ వేయించారు. దీంతో తురకవాండ్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సర్పంచి చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి వికలాంగుల పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలో వికలాంగుల పింఛను పొందుతున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లను శుక్రవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ పంచాయతీల వారీగా పరిశీలిస్తారని ఎంపిడిఒ నరసింహమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛను దారులు తమ సదరం సర్టిఫికెట్ ఒరిజినల్ పత్రాలు, పింఛను పత్రాలను తనిఖీ అధికారులకు చూపించాల్సిన్నారు. ఎవరైనా నకిలీ పత్రాలు చూపించి పింఛను పొంది ఉంటే ఉంటే చర్యలు తప్పవన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే పరీక్షలకు హాజరైన గర్భిణులకు రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధినేత, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో 82 మంది మహిళలకు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం గర్భిణులకు ఉచితంగా భోజనం అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణులు, రమానందన్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈకేవైసీ వేగవంతం చేయండి

ప్రజాశక్తి-గోరంట్ల

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలని ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్ ఆదేశించారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఎడిఎ మండల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ ప్రస్తుత రబీలో సాగు చేసిన రైతుల వివరాలతో ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎస్‌కె సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతుల పొలాలకు దారిని పునరుద్ధరిస్తాం

శ్రీ షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు శిల్ప

ప్రజాశక్తి-పెనుకొండ

రైతుల పొలాలకు వెళ్లే బండి దారిని పునరుద్ధరిస్తామని శ్రీ షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు శిల్ప తెలిపారు. పట్టణ శివారులోని రాంపురం సమీపంలోని ట్రస్ట్ ఫామ్ హౌస్ వద్ద గురువారం తహశీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో రైతులు, ట్రస్టు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాలకు వెళ్లే దారి, రైతుల పొలాల సమస్యలపై చర్చించారు. శిల్ప మాట్లాడుతూ ట్రస్ట్‌కు రైతులను ఇబ్బందులకు గురి చేసే ఆలోచన లేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తాము సానుకూలంగా ఉన్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి రైతుల భూములను గుర్తించాలన్నారు. రైతుల భూమి ఒక్క సెంటు కూడా ట్రస్టుకు అవసరం లేదని, ట్రస్టు భూమి ఒక్క సెంటు వదులుకోవడానికి మేము సిద్ధంగా లేమని ఘాటుగా వ్యాఖ్యానించారు. రైతుల భూములకు వెళ్లే దారికి వేసిన కంచెను తొలగిస్తామన్నారు. వారం రోజుల్లో భూమి సర్వే చేసి రైతుల భూములను గుర్తిస్తామని తహశీల్దార్ తెలిపారు. సమావేశంలో వీఆర్వో, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న శిల్ప, తహశీల్దార్ శ్రీధర్

'స్టెమి' గుండెకు భరోసా

ప్రజాశక్తి-పెనుకొండ

స్టెమి గుండెకు భరోసా అని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మోహన్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో స్టెమి గుండెకు భరోసా గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వారికి అత్యవసర పరిస్థితిలో స్టెమి ఇంజక్షన్ వేసి ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఇంజక్షన్ తీసుకున్న తర్వాత గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసుకునే వరకూ ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఛాతి నొప్పి, గుండె దడ, స్పృహ కోల్పోవడం, తదితర లక్షణాలు గుండెపోటుకు సంబంధించినవిగా గుర్తించాలన్నారు. గుండెపోటు వచ్చిన గంటలోపు సమీపంలో ఉన్న ఆసుపత్రులకు వెళ్లే రూ. 45 వేల విలువ చేసే టెనెక్టా ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా వేసి ప్రాణాలు కాపాడుతారన్నారు. ప్రజలు ఈ ఇంజక్షన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సలహా సంఘం సభ్యులు చంద్రశేఖర్, త్రివేంద్ర, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్

దోమల నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి-మడకశిర

దోమల నివారణపై గురువారం మండలంలోని బుల్లసముద్రం గ్రామంలో కల్లుమర్రి పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ముందుగా పిహెచ్‌సి ఫీల్డ్ సిబ్బంది, మలేరియా ఉప యూనిట్ అధికారి బుల్లసముద్రం గ్రామంలో పర్యటించి దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే చేశారు. మలేరియా, డెంగీ, ఇతర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీ కాలువల్లో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వినోద్‌కుమార్, కల్లుమర్రి పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికైన గొర్రెలపెంపకందారుల సహకార సంఘం సభ్యులు

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని నాగినాయినిచెరువు గ్రామంలో గురువారం శ్రీమద్రెమ్మ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలక వర్గాన్ని డాక్టర్ చంద్రశేఖర్, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ భారతి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షులుగా ఎల్.సేవన్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా డి.వెంకటేష్, సభ్యులుగా రామచంద్రప్ప, చంద్రకళాబాయి, శీనానాయక్, లక్ష్మీనరసింహులు, గంగాదేవిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకర్‌నాయక్, జనార్ధన్, గంగాధర్, శీనానాయక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కె.గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ భోజనపు రమణ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే అక్కడ నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు సోకిన వెంటనే పిహెచ్‌సికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అలాగే వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులునాయక్ కూడా ప్రతి కేసునూ పర్యవేక్షించారు. వారి వెంట ఎంపిహెచ్ఇఒ ఎన్.ఈశ్వరయ్య, ఆశ ఉన్నారు.

వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్న వైద్యులు

13 నుంచి సేవాలాల్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-గుత్తి

సేవాఘడ్‌లో ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సేవాఘడ్ సమావేశ మందిరంలో సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు గుంతకల్లు, గుత్తి రైల్వేస్టేషన్‌ల నుంచి సేవాఘడ్‌కు ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అవసరమైతే వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

ఏర్పాట్లు పరిశీలన

సేవాఘడ్‌కు దిశా నిర్దేశం చేసే సూచిక బోర్డులను తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఏర్పాటు చేయాలన్నారు. సేవాఘడ్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లును ఫిబ్రవరి 12లోపు పూర్తిచేయాలన్నారు. విద్యుత్, తాగునీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జయంతి ఉత్సవాలు ముగిసేంత వరకు సేవాఘడ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంస్కృతిని చాటిచెప్పే ప్రదర్శన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయం వద్ద ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజా సమస్యలు పట్టని ప్రజా ప్రతినిధులు.. !

వారి బాటలోనే మండల స్థాయి అధికారులు
30 నిమిషాల్లోనే ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

సమావేశానికి అరకొరగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం తమకు అవసరం లేదన్నట్లుగా పలువురి ప్రజాప్రతినిధుల తీరు ఉంది.ప్రజా ప్రతినిధులకు తగ్గట్టుగా మండల స్థాయి అధికారులు సైతం వ్యవహరిస్తున్నారు. దీనికి నిదర్శనం హిందూపురం మండలం సర్వసభ్య సమావేశం. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన మండల స్థాయి సమావేశానికి సకాలంలో హాజరు కావాల్సిన ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపీటీసీలు, చివరకు సర్పంచులు సైతం పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. ఈ ప్రజా ప్రతినిధుల బాటలోనే మండల స్థాయిలో ఉన్న అధికారులు, పంచాయతీ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు నడిచారు. వారు కూడా పూర్తిస్థాయిలో సమావేశానికి హాజరు కాలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల స్థాయి సమావేశానికి ఎంపిపి, ఉపాధ్యక్షులతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై వారి వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యతఉంది. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల అధికారులు ఈ సమావేశాలకు హాజరై, వారి వారి శాఖలకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించాల్సి ఉంది. దీంతోపాటు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పథకాల గురించి ప్రజాప్రతినిధులకు అధికారులు వివరించాల్సి ఉంది. అయితే ఈ సమావేశానికి అటు ప్రజా ప్రతినిధులు గాని ఇటు అధికారులు కానీ పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం గమనార్హం. ఇన్‌చార్జ్ ఎంపిడిఓ శివకుమార్ తో పాటు అధికారులు మండల వ్యాప్తంగా 15 మంది ఎంపిటిసిలకు ఫోన్ చేసి రమ్మని చెప్పినా సకాలంలో పట్టు మని 10 మంది సైతం హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో సమావేశాన్ని ఒక గంట పాటు వాయిదా వేస్తున్నట్లు ఎంపిపి రత్నమ్మ ప్రకటించారు. అనంతరం మళ్లీ అధికారులు ఫోన్ చేసి సమావేశానికి హాజరు కావాలని ఎంపిటిసిలకు కోరారు. దీంతో అందుబాటులో ఉన్నా ఐదుగురు ఎంపిటిసిలు సమావేశానికి వచ్చారు. కోరం ఉండడంతో సమావేశాన్ని మధ్యాహ్నం 12.40 గంటలకు ఎంపిపి రత్నమ్మ ప్రారంభించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సురేంద్ర నాయక్, డిప్యూటి తహసీల్దార్ మునూద్దీన్, గృహ నిర్మాణ శాఖ ఎఈ నారాయణ రెడ్డి, పంచాయితీ రాజ్, రోడ్డు భవనాల శాఖ ఎఈలు వేణుగోపాల్, మోహన్, ఎన్ఆర్‌జిఎఎస్ అధికారిణి లలిత, ఎంఈఓ గంగంప్ప, పశుసంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన వివరాలను వివరించారు. వెంటనే సమావేశం ముగించారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 14 మంది సర్పంచులు, 15 మంది ఎంపిటిసిలు వారి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యలను వివరించినా కనీసం సమావేశం 2గంటలకు పైగా పడుతుంది. అయితే హాజరైనా అరకొర మంది సైతం ఒక్క సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకు రాలేదు. కేవలం అధికారులు మాత్రం వారి శాఖల ప్రగతిని వివరించి సమావేశాన్ని మమ అనిపించారు. ఈ వ్యవహారంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్య, పారిశుధ్య సమస్యతో పాటు నూతన రేషన్ కార్డుల కోసం ఎంతో మంది ధరఖాస్తులు చేసుకోవడానికి వేచి ఉన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో ప్రజలు ఎదో ఒక సమస్యతో బాధపడుతున్నారు. ఆ సమస్యలను సమావేశంలో చర్చించి, పరిష్కారం చూపాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు వీటిపై ఏ మాత్రం దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి రైల్వే గేట్ సమీపంలో బుధవారం రాత్రి కొత్తచెరువు గ్రామానికి చెందిన బోయ రంగప్ప (60) రైలు క్రింద పడి మృతి చెందాడు. ఈయన బేల్దారి పనిచేసుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. పనులు లేకపోవడంతో అప్పులు అధికమై ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి మృతి చెందినట్లు మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ ఆక్రమణపై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమకు చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించారనిపట్టణానికి చెందిన కొయ్య కాంతమ్మకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి రెవిన్యూ పొలం సర్వే నెంబర్ 39, 40 లో ఉన్న వారి స్థలం విషయంలో కాంతమ్మకి, ఆమె భర్త సోదరుడు శ్రీరాములు కూతురు కంకణాల అంజినమ్మకు గత కొంత వివాదము నడుస్తోందన్నారు. ఈ విషయంలో కంకణాల అంజినమ్మ, ఆమె సోదరి లక్ష్మి దేవి, వారి తల్లి కొయ్య రామలక్ష్మితో పాటు మరి కొంతమంది వివాదంలో ఉన్న భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తన భూమికి సంబంధించిన సరిహద్దులను ధ్వంసం చేశారని కాంతమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. ఈనేపథ్యంలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు .

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో మట్కా గంజాయి పేకాట వంటి అసాంఘిక కార్యకలా పలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. కదిరి టౌన్‌లో గతంలో మట్కా, గంజాయి, పేకాట కేసులలో నిందితులుగా ఉన్నవారిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కదిరి టౌన్‌లోనిమగ్గాల క్వార్టర్స్, రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఆర్‌అండ్‌బి బంగాళా, జూనియర్ కాలేజి గ్రౌండ్, డిగ్రీ కాలేజి గ్రౌండ్, నానా దర్గా వెనుక వైపున మరికొన్ని ప్రదేశాలలో రాత్రి పూట కొంత మంది ఆకతాయిలు మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్య కలాపాలు చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు .అలాంటి వారిపట్ల ప్రత్యేక నిఘా కోసం పోలీస్ మొబైల్ టీములు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లఘింస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.



జగన్‌తో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

జగన్‌ను కలిసిన 'పురం' వైసిపి నేత

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని హిందూపురం వైసిపి నాయకులు కొండురు వేణు గోపాల్ రెడ్డి గురువారం తాడేపల్లిలో కలిశారు. నియోజక వర్గంలో పార్టీ పరిస్థితి, ఇటీవల మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక తీరు గురించి జగన్ అడిగి తెలుసుకున్నట్లు వేణు గోపాల్ రెడ్డి తెలిపారు.

కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంస్కృతిక మండలి లో ఈనెల 9న ఆదివారం నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరానికి సంబందించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్త మాట్లాడుతూ ఈ శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి– బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్న శేఖర్ రెడ్డి, హరినాథ్, రామకృష్ణ, సత్రశాల ప్రసన్నకుమార్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -హిందూపురం

హిందూపురం పట్టణంలో ఈ నెల 21,22 వ తేదీలలో జరిగే ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర మంజుల కోరారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు గురువారం విడుదల చేశారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా పిఎస్ యు జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫి వుల్లా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు నాయకులు వంశీ, సురేష్, గిరీష్ ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సహకారంతో డ్రైవర్లకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. పట్టణంలోనీ ఆర్టీవో ఆఫీసులో అనంతపురం సవేర హాస్పిటల్ సౌజన్యం తో కదిరి పట్టణం లోని వాహన దారులందరికి ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. వాహనదారులు ఈ సదావకాశాన్ని వినియోగించు కోవాలని ఎంవిఐ వరప్రసాద్ కోరారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి - పరిగి

నియోజకవర్గంలోని ప్రతి మండలకేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు టిడిపి నాయకులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పరిగి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణాన్ని చేపట్టాలని స్థానిక టిడిపి నాయకులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పార్టీ మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమి పూజ చేశారు.

షాదీ మహల్‌లో బోరు బావి తవ్వకం : పరిగి మండల కేంద్రంలోని షాదీమహల్ కు నీటి కొరత తీవ్రంగా ఉందని మదీనా మజీద్ ముతవాలి మహబూబ్ ఖాన్ మూన్ వర్ష మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె షాదీమహల్ ఆవరణంలో పంచాయతీ నిధుల ద్వారా బోరు బావి తవ్వకానికి నిధులు కేటాయించాలని ఆదేశించారు. దీంతో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో బోరు తవ్వకాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాలాజీ, జడ్పిటిసి సూర్యనారాయణ, మోదరవి, నాగరాజు నాగభూషణం సోమప్ప, చౌడప్ప, హనుమయ్యశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

'ఎంఇ సరెండర్ ఉత్తర్వులు సస్పెండ్'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలసుబ్రమణ్యంను ఇంజనీరింగ్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఈ నెల 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై బాలసుబ్రమణ్యం హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరు వర్గాల వాదనలను విన్న హైకోర్టు మున్సిపల్ ఇంజనీర్ సరెండర్ ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. ఇంజనీర్ ను అక్కడే విధులను కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా హిందూ పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్ బాలసుబ్రమణ్యంకు, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుకు మధ్య సఖ్యత లేకపోవడంతో ఆయనను సరెండర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే మున్సిపల్ కమిషనర్‌కు సరెండర్ చేసే అధికారాలు లేకపోయినప్పటికీ తనను సరెండర్ చేశారని మనస్తాపానికి గురైన ఇంజనీర్ బాలసుబ్రమణ్యం హైకోర్టును ఆశ్రయించారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం సరెండర్‌ను సస్పెండ్ చేసింది. మున్సిపల్ కమిషనర్ కు సరెండర్ చేసే పరిధి లేదని ఉత్తర్వులో పేర్కొంది.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. గురువారం నిర్వహించిన సమీక్షకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డీఈవో కిష్టప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ పేద కుటుంబాలకు చెందిన వారేనని వారికి కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని, అందుకు తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు, ఫర్నిచర్ తోపాటు విద్యార్థుల రికార్డులను భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎంఇఒ, హెచ్‌ఎంలపై ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది జరిగే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోవాలని నియోజకవర్గంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా తగిన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతేకాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత, మరుగుదొడ్ల సమస్య, తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు – నేడు కింద చాలా ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణ పనులు, భవనాల నిర్మాణ పనులు జరిగాయని కొన్నిచోట్ల నిధుల సమస్యతో అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయని పలువురు ఎంఇఒలు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. అలాంటి వాటిపై తనకు నివేదికలు ఇస్తే మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో చాలాచోట్ల ఎంఆర్‌సి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటికి మరమ్మతులు లేదా నూతన భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ఎమ్మెల్యేకు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఖ్లి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ లభిస్తుందని అర్హత ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా శాఖ అధికారులు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు గోపాల్ నాయక్, మోహన్ బాబు, జయచంద్ర ,రెడ్డప్ప, ప్రసాద్, ఖాదరవలి, రమణ, సురేష్, జిలాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో స్వచ్ఛ దివస్ నిర్వహించాలి

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండలాన్ని స్వచ్ఛ మండలంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపిడిఓ డి.అంజినప్ప సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,వెలుగు సిబ్బంది,అంగన్వాడీ, సచివాలయ సిబ్బందితో "స్వచ్ఛతాహి సేవ"కార్యక్రమంపై సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని అన్ని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవరెడ్డి,ఎంఈవో సుబ్బిరెడ్డి,ఏపీవో చంద్రశేఖర్,ఎపిఎం వెంకటనారాయణ,సూపర్వైజర్ నరసమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జెవి.సురేష్ బాబు, ఏపీఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అధికారి బి.హరికృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం పట్టణంలోని తారకరామాపురం, గుట్ట కింద పల్లి లో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు హాజరై ఉపాధి పొందగలరని వారు తెలిపారు. ఇతర వివరాలను సెల్ నెంబర్ 9182288465కు సంప్రదించాలని తెలిపారు.

అడవులను కాపాడుకుందాం

ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అడవులకు వేసవిలో నిప్పు పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ, ఉపాధ్యాయులు అడవికి నిప్పు మానవాళికి ముప్పు అంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అటవీ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ జాతీయ అటవీ విధానం ప్రకారం భూమి మీద 33 పచ్చదనంతో నిండి ఉండాలన్నారు. అయితే సుమారు 13 శాతం వెనుకబడి ఉన్నామన్నారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి అడవులను వేసవిలో అగ్ని బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. వ్యవసాయ భూములలో మొక్కలు విరివిగా నాటి సంరక్షించడం వల్ల 33 శాతం పచ్చదనం పెంపొందించుకోవచ్చన్నారు. అప్పుడే మానవ మనుగడ సాధ్యమన్నారు. అడవులతో ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. లక్షలాది వణ్య ప్రాణాలు కాపాడుకొనడమేకాకుండా విలువైన ఔషధాలు తీసుకోవచ్చు అన్నారు.కాలుష్య నివారణకు, ప్రశాంత వాతావరణానికి దోహదపడే అడవులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ బుక్కపట్నం రేంజర్ శ్రీనివాస్ రెడ్డి, పెనుకొండ రేంజ్ అధికారి గుర్రప్ప, డిఎస్పి విజయ్ కుమార్, ఇతర అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిమర్రి: అడవికి నిప్పు భవితకు ముప్పు అని అధికారులు తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ అటవీ ప్రాంతమైన చిల్లవారిపల్లి దాడి తోట గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు గొర్రెల కాపరులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే హుస్సేనప్ప, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

దేశంలో హిందూ, ముస్లింల సమైఖ్యత కోసం తన చివరి శ్వాస వరకు ఉద్యమించిన గొప్ప నాయకుడు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అని మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోదులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 136వ జయంతిని గురువారం పట్టణంలోని అబ్దుల్ గఫార్ ఖాన్ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సబీహా బాను అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, మాజీ మున్సిపల్ చైర్మేన్ అనీల్ కుమార్, పలువురు కౌన్సిలర్లు టిడిపి నాయకులు డైమండ్ బాబా, ఫాజిల్, అజ్మత్, పలువురు కౌన్సిలర్లు, స్థానికులు హాజరయ్యారు.

వైవిఆర్ కుడి కాలువకు నీరు విడుదల

రిజర్వాయర్‌లో నీటిని చూస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపాన ఉన్న యోగివేమన జలాశయం కుడి కాలువ ద్వారా 70 క్యూసెక్కుల నీటిని అధికారులు గురువారం విడుదల చేశారు. ఎస్ఇ విశ్వనాథ్ రెడ్డి, ఈఈ.ఆర్వేటి రాము, ఏఈఈ కృష్ణ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దొరిగల్లు , 1–2 , కొడవండ్లపల్లి, బధనాంపల్లి, చిత్ర వారి పల్లి, చెరువులకు నీరు విడుదల చేయడం వలన 12 గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ,కోట్ల బాబి, ఓబిరెడ్డి ,కొలసాని చంద్ర, ఆనంద్ , గోడి ప్రకాష్ ,వైస్ చైర్మన్ శివయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత సేవలు

ఉచిత సేవలను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ కదిరి జోన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు, అన్ని విభాగాల ఉద్యోగులకుఉచిత సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి వై వి సుబ్బారెడ్డి తెలిపారు.ఈసందర్భంగా వారు ఉచిత సేవలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, ఆజాం బాషా కదిరి జోన్ నాయకులు రమణ నాయక్, ఖాజ, భార్గవ్, జబీయుల్ల, కనికరం ప్రసాద్, ఖాదర్ భాష, బ్రహ్మేంద్ర, వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, అమర్నాథ్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన దస్తగిరి కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం కొత్తచెరువు పరామర్శించారు. దస్తగిరి కొద్దిరోజులుగా ఆనా ఆరోగ్యంతో బాధపడుతూ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తోపాటు ఎమ్మెల్యే పల్లె బైరాపురం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో గత కొన్ని రోజులు క్రితం మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరామర్శించారు. మృతుని భార్యకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బైరాపురం సర్పంచి రవి ,టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు సింగల్ విండో ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, శంకర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిఐ

ప్రజాశక్తి - -ధర్మవరం రూరల్

వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని టూ టౌన్ సిఐ రెడ్డప్ప పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక రేగాటిపల్లి రోడ్డు నందు గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరూ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు కాపాడే ప్రయత్నం ఎవరూ చేయటం లేదని ఇది చాలా బాధాకరమైన విషయమని అన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం గుడ్ సమారిటన్ పేరిట అవార్డులను తీసుకొచ్చిందని, ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి కేంద్రం ద్వారా రూ. 5వేలు రివార్డు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో